

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

సోమవారం
02 నవంబర్ 2026

పేజీలు : 8



రామాలయం ప్రచార కేంద్రాల్లో

సిబ్బంది ఇష్టారాజ్యం!



- నగదు ఉంటేనే స్వామివారి జ్ఞాపికలు.. డిజిటల్ చెల్లింపులకు నో
- భక్తుల పట్ల అమర్యాదకర వైఖరిపై ఆగ్రహం.. స్టాక్ నిర్వహణలోనూ గందరగోళం
- అధికారుల పర్యవేక్షణ ఏదీ? భక్తుల ఇబ్బందులపై స్పందించరా?

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)

స్వామివారి దర్శనానికి వస్తే భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన రామాలయం ప్రచార కేంద్రాల్లో నగదు ఉంటేనే వస్తువులు విక్రయిస్తారా? డిజిటల్ చెల్లింపులు అడిగితే అమర్యాదకరంగా సమాధానమిస్తారా? భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవ స్థానం ప్రచార కేంద్రాల్లో కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై భక్తుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్వామి వారి చిత్రపటాలు, క్యాలెండర్లు, జ్ఞాపికలు కొనుగోలు చేయాలనుకునే భక్తు లను నగదు లేదనే కారణంతో వెనక్కి పంపు తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, అడిగిన వస్తువులు అందుబాటు లో లేకపోవడం, స్టాక్ నిర్వహణలో గందర గోళం భక్తులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

నగదు లేకుంటే కొనుగోళ్లు లేనట్టే!


ఆలయ ప్రచార కేంద్రాల్లో స్వామివారి చిత్రపటాలు, క్యాలెండర్లు, ప్రతిమలతో కూడిన జ్ఞాపికలు విక్రయిస్తుంటారు. దర్శనం అనంతరం వీటిని కొనుగోలు చేసి తమ ఇళ్లకు తీసుకెళ్లాలని భక్తులు ఆసక్తి చూపుతుంటారు. అయితే, నగదు చెల్లింపు లకే ప్రాధాన్యం ఇస్తూ ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ చెల్లింపులను అంగీకరించడం లేదని భక్తులు వాపోతున్నారు. చేతిలో నగదు లేకపోయినా ఫోన్ ద్వారా చెల్లిస్తామని చెబుతున్నా, నగదు తీసుకొస్తేనే వస్తువులు ఇస్తామని సిబ్బంది స్పష్టం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులు అడిగితే చులకనగా సమాధానాలా?

చిన్న దుకాణాల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు డిజిటల్ చెల్లింపులు సాధారణమైపోయిన ప్రస్తుత కాలంలో, దేవస్థానం ప్రచార కేంద్రాల్లో మాత్రం ఆ సౌకర్యం అందుబాటులో లేకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెల్లింపుల విధానం గురించి అడిగినప్పుడు కొంతమంది సిబ్బంది మర్యాదగా సమాధానం ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన చోట, వారిని నిరుత్సాహపరిచే ధోరణి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

వార్తా లోపలి పేజీలో

పాల్వంచలో ఎన్వీడీసీఎల్
నిర్లక్ష్యానికి అంతులేదా?



వార్తా 2వ పేజీలో..



గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు
సకాలంలో హాజరు కావాలి

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)

గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై
రాజీలేని పోరాటం

పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వరరావు

వార్తా లోపలి పేజీలో

ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలు
గొంతు దిగని ముద్ద





- పాత స్టాకును కొత్త రేట్ల తో అమ్ముతున్న వ్యాపారులు...
- ప్రతి దుకాణం ముందు ప్రభుత్వ ఎమ్మార్పీ బోర్డులు తప్పనిసరి...
- అడ్డగోలుగా రేటు పెంచితే కఠిన చర్యలు - డి టి సివిల్ సప్లై

మణుగూరు, నవంబర్ 01 (జనంసాక్షి):

తెలంగాణలో బియ్యం ధరలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వినియోగించే సన్న బియ్యం ధరలు భారీగా పెరగడంతో వంటింటి బడ్జెట్ పూర్తిగా తలకిందులైంది. మార్కెట్‌లో బియ్యం కొరత రాబోతుందనే అంచనాలు కొంతవరకు ఉంటే, అదే సాకుతో దళారులు, రైస్ మిల్లర్లు మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి సిండికేట్‌గా మారడం ధరలు ఆకాశాన్నంటడానికి ప్రధాన కారణమయ్యాయి.

సెంచరీ దాటిన ధరలు:

నాణ్యమైన సన్న రకాల బియ్యం ధరలు రిటైల్ మార్కెట్లో కిలో రూ. 100 మార్కును దాటేశాయి. విపరీతమైన డిమాండ్ ఉండే 'జై శ్రీరామ్' లాంటి సూపర్ ఫైన్ సన్న రకం బియ్యం ధర ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ. 101 నుండి రూ. 105 వరకు పలుకుతోంది. అంటే క్వింటాల్ బియ్యం ధర దాదాపు రూ. 10,100 కి చేరింది. ఇతర సాధారణ సన్న బియ్యం రకాలు కిలో రూ. 80 నుండి రూ. 90 వరకు

మిగతా 2లో

ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలు - గొంతు దిగని ముద్ద

విక్రయించ బడుతున్నాయి. గతంలో రూ. 1,500 నుండి రూ. 1,600 మధ్య ఉన్న 25 కిలోల బియ్యం బస్తా ధర, ఇప్పుడు రకాన్ని బట్టి రూ. 1,900 నుండి రూ. 2,150 కి పైగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సోనామసూరి లాంటి ప్రముఖ రకాల ధరలు దాదాపు 65 శాతం పైగా పెరిగాయి. అలాగే ఏప్రిల్‌లో 4 శాతంగా ఉన్న బియ్యం ద్రవ్యోల్బణం రేటు ఏకంగా 13 శాతానికి ఎగబాకింది

బ్లాక్ మార్కెట్ సిండికేట్ దందా:

కొందరు వ్యాపారులు, మధ్యవర్తులు బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరతను సృష్టించడం, అధిక మార్జిన్లకు అమ్ముకోవడం వల్ల కూడా ధరలు పెరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి.పెరిగిన పెట్టుబడి రైతులకు పండించే ఖర్చులు (ఎరువులు, పురుగుల మందులు) పెరగడం, మిల్లింగ్ రవాణా ఛార్జీలు ఎక్కువవ్వడం కూడా ఒక కారణం కొంతవరకు నిజం ఉంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా కందిపప్పు, పెసరపప్పు, వంటనూనెలు, ఉల్లిపాయల ధరలు కూడా భారీగా పెరగడంతో సామాన్యుడిపై ఆర్థిక భారం మరింత తీవ్రమైంది.

దళారులు, మిల్లర్ల 'కృత్రిమ కొరత:

రాష్ట్రంలో వరి సాగు ధాన్యం ఉత్పత్తి భారీగానే ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో కొరత రాబోతోందనే భయాన్ని సృష్టించారు. రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు లక్షల టన్నుల సన్న బియ్యాన్ని తమ గోదాముల్లో నిల్వ ఉంచారనే ఆరోపణలు ఉన్నాయి.మార్కెట్‌లో సహజంగా పెరిగిన ధర 10 నుండి 15 శాతం అయితే, ప్రస్తుతం పెరిగిన ధరలు దాదాపు 40 నుండి 60 శాతం వరకు ఉన్నాయి. మార్కెట్‌లో సహజంగా పెరిగిన ధర 10 నుండి 15 శాతం అయితే, ప్రస్తుతం పెరిగిన ధరలు దాదాపు 40 నుండి 60 శాతం వరకు ఉన్నాయి. పాత స్టాక్‌ను ఎక్కువ ధరకు అమ్మడం తక్కువ ధర ఉన్నప్పుడు కొనుగోలు చేసిన పాత బియ్యం నిల్వలను కూడా ప్రస్తుత మార్కెట్ కొరతను సాకుగా చూపిస్తూ భారీ రేట్లకు విక్రయిస్తున్నారు. రేట్లు పెంచడమే కాకుండా మార్కెట్‌లో విక్రయించే 25 కిలోల బియ్యం బస్తాలను తూకం వేస్తే కేవలం 23 కిలోలే వస్తున్నట్లు కొన్ని చోట్ల వినియోగదారులు గుర్తించారు. దీంతో మధ్యతరగతి సామాన్య ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ప్రభుత్వం తీసుకున్న తాజా చర్యలు:

ఈ దళారీ వ్యవస్థకు, వ్యాపారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. పౌరసరఫరాల శాఖ మిల్లర్లు, ట్రేడర్లతో చర్చలు జరిపి బియ్యంపై గరిష్ట అమ్మకపు ధర ను ఖరారు చేసింది.బియ్యం రకం ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధర (కిలోకు) బిపిటి, కేఎన్ఎమ రకాలు రూ. 66 ,ఆర్ ఎన్ ఆర్ ,తెలంగాణ సోనా రూ. 74 ,హెచ్ ఎం టి జై శ్రీరామ్ (జై ఎస్ ఆర్) రూ. 79 మించకూడదని తేల్చి చెప్పింది.

అధిక ధరలపై ఫిర్యాదు చేయండి:

ప్రస్తుతం మార్కెట్లో విక్రయిస్తున్న బియ్యం నిల్వలన్నీ గత వ్యవసాయ సీజన్‌కు సంబంధించినవే కొత్త సాగు ఎల్‌నినో అంచనాలను సాకుగా చూపిస్తూ పాత స్టాక్ ధరలను అడ్డగోలుగా పెంచడం చట్టవిరుద్ధం. వినియోగదారులు ఎవరైనా తమ పరిధిలోని దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ రేట్లకు బియ్యం విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.వ్యాపారులు తమ దుకాణాల వద్ద స్టాక్ వివరాలు, ధరల బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇంతకంటే ఎక్కువ రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై అధికారి గుర్రం ప్రభాకర్ హెచ్చరించారు.

- గుర్రం ప్రభాకర్ రావు డి టీ సివిల్ సప్లై మణుగూరు.



నక్కల జానమ్మ గారి చిత్రపటానికి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్

పెద్దవూర నవంబర్ 1 (జనంసాక్షి)

ప్రొఫెసర్ నక్కల జూన్ రెడ్డి గారి మాతృమూర్తి స్వర్గీయ నక్కల జానమ్మ గారి దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జానమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించి భావోద్వేగంగా నివాళులర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు తన లోతైన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 'రంజిత్ అన్న యువసేన' అధ్యక్షులు కుంటిగొర్ల రాజశేఖర్ యాదవ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కడియం సైదులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెండే అనిల్ కుమార్ యాదవ్, తెలకపల్లి శ్రీను, ముద్ద నవీన్ కుమార్ తదితర నాయకులు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

పాల్వంచలో ఎన్పీడీసీఎల్ నిర్లక్ష్యానికి అంతులేదా?

"నేనొక్కడినేనా అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది? హోటల్ యజమాని"...

అక్రమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ చోరీలపై చర్యలు ఏవీ?

ఉద్యోగుల ఫిర్యాదుల విచారణలోనూ జాప్యం.. అక్రమార్కుల విషయంలోనూ ఉదాసీనత!

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 01 (జనంసాక్షి): పట్టణంలో ఎన్పీడీసీఎల్ విద్యుత్ శాఖ పనితీరు, అధికారుల వ్యవహారశైలి ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఒకవైపు ఉద్యోగుల ఫిర్యాదులపై విచారణలు నత్తనడకన సాగుతుండగా, మరోవైపు అక్రమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ చోరీలపై ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమాచారం ఇచ్చిన వారికే తిరిగి సమాచారం చేరవేస్తున్నారా? అక్రమ విద్యుత్ వినియోగదారులకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారా? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంస్థకు ఆర్థిక నష్టం కలిగిస్తున్న వ్యవహారాలపై అధికారులు ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఉద్యోగుల ఫిర్యాదుల విచారణలో కుల ప్రభావం ఉందా?

బాధితుల గోడు వినేదెవరు.. న్యాయం జరిగేదెప్పుడు?

ఇటీవల కొందరు ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు, అధికారులపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో విచారణ కమిటీ వేగంగా స్పందించి వాస్తవాలను వెలికితీయాల్సి ఉంది. అయితే విచారణ ప్రక్రియ ఆశించిన వేగంతో సాగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణలో కుల ప్రభావం పనిచేస్తోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొంతమంది బాధితులతో మాట్లాడగా, అసలు ఫిర్యాదుదారులను పక్కనపెట్టి సంబంధం లేని వ్యక్తుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టినట్లుగా వారు ఆరోపిస్తున్నారు. విచారణ కమిటీ వ్యవహారశైలిపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరగాల్సిన చోట జాప్యం ఎందుకు? బాధితులకు న్యాయం జరిగే రోజు ఎప్పుడు? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లపై చర్యలకు యజమానుల అనుమతి అవసరమా?

స్టైసీ హోటల్ వ్యవహారంలో అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

ఇటీవల బీఆర్ఎస్, బీఆర్వీ సంయుక్తంగా చేపట్టిన ర్యాలీ సందర్భంగా స్టైసీ హోటల్ వద్ద ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సందర్భంలో సదరు హోటల్ యాజమాన్యం నుంచి అధికారులకు ఎదురైనట్లు చెబుతున్న సమాధానం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

"నేనొక్కడినేనా అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది?

పట్టణంలో ఇంకా అనేక చోట్ల అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ముందుగా వాటి సంగతి తేల్చి, ఆ తర్వాత మా దగ్గరకు రండి" అంటూ యాజమాన్యం అధికారులను ప్రశ్నించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.ఈ వ్యవహారం నిజమైతే అధికారుల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తక తప్పదు. పట్టణంలో ఎక్కడైనా అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే వాటన్నింటిపై ఒకేసారి విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులది కాదా? ఒకరి అక్రమాన్ని మరొకరి అక్రమంతో సమర్థించుకోవచ్చా? అక్రమ విద్యుత్ కనెక్షన్లపై ఫిర్యాదులు అందినప్పుడు అధికారులు స్పందించాల్సింది పోయి కాలయాపన చేయడం వెనుక కారణాలేమిటో ఉన్నతాధికారులు స్పష్టం చేయాలి.

భక్తిశ్రద్ధలతో మద్దిమడుగు ఆంజనేయస్వామి దీక్ష పోస్టర్ ఆవిష్కరణ!

- ఆంజనేయస్వామి దీక్షతో ఆధ్యాత్మిక చైతన్యం.. భక్తి విశ్వాసాలతో స్వామివారి కృపకు పాత్రులు కావాలి
- హనుమాన్ శక్తి జాగరణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్వరం శివయ్యచారి గురుస్వామి



గుడిపల్లి,నవంబర్ 01(జనంసాక్షి):

శ్రీశ్రీశ్రీ మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి దీక్ష మాలధారణ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను గుడిపల్లి మండలం చిలుకమర్రి స్టేజీ సమీపంలోని శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఆవిష్కరించారు. శ్రీ మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దీక్ష వ్యవస్థాపకులు శ్రీ కేతావత్ జయరాం గురుస్వామి ఆదేశాల మేరకు హనుమాన్ శక్తి జాగరణ సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్వరం శివయ్యచారి గురుస్వామి, పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు గుండాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహేశ్వరం శివయ్యచారి గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా భక్తులు శ్రీ మద్దిమడుగు ఆంజనేయ స్వామి దీక్ష మాలధారణ చేసుకొని ఆధ్యాత్మిక చింతనతో పునీతులు కావాలని కోరారు. స్వామివారిపై అచంచల మైన భక్తి,విశ్వాసాలతో దీక్షను చేపట్టి ఆంజనేయస్వామి కృపాకటాక్షాలను పొందాలని పిలుపునిచ్చారు.

భక్తికి ఆడంబరాలు అవసరం లేదు

ప్రస్తుత ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక,పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో గ్రామీణ ప్రజలు,రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని దీక్ష చేపట్టే స్వాములు అనవసరమైన ఖర్చులకు దూరంగా ఉండాలని సూచించారు. ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా తమ శక్తి,స్థోమతకు అనుగుణంగా స్వామివారికి సమర్పణలు చేసుకుంటూ భక్తిశ్రద్ధలతో దీక్షను కొనసాగించాలని కోరారు. భక్తి, విశ్వాసాలే ప్రధానమని,ప్రతి ఒక్కరూ ఆంజనేయస్వామి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మూనా, తిరుమల్, శివ, కొండల్, అంజి,శశి, యాదగిరి,శేఖర్, లాలు,శ్రీను,ఆంజనేయులు తదితర గురుస్వాములు,భక్తులు పాల్గొన్నారు.

రామాలయం ప్రచార కేంద్రాల్లో సిబ్బంది ఇష్టారాజ్యం!

నగదు కోసం మళ్లీ ఆలయం బయటకు!

ప్రచార కేంద్రాల్లో డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేకపోవడంతో భక్తులు నగదు కోసం ఆలయం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సమీప దుకాణాల వద్ద నగదు మార్పించుకోవడం, ఏటీఎంలకు వెళ్లి డబ్బులు తీసుకురావడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలు, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ కారణంగా అదనపు అవస్థలు పడుతున్నారు. దర్శనం పూర్తయిన తర్వాత ప్రశాంతంగా జ్ఞాపికలు కొనుగోలు చేసి వెళ్లాల్సిన భక్తులు నగదు కోసం తిరగాల్సి రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడిగిన వస్తువులు ఉండవు..

ఉన్నవే తీసుకోవాలట!

ప్రచార కేంద్రాల్లో స్టాక్ నిర్వహణ సరిగా లేదని కూడా భక్తులు ఆరోపిస్తున్నారు. తాము అడిగిన వస్తువులు లేవని, అందుబాటులో ఉన్నవే తీసుకెళ్లాలని సిబ్బంది చెబుతున్నట్లు వాపోతున్నారు. అదనం గా కావాల్సిన వస్తువులు అడిగినా లేవంటూ సమాధానం ఇస్తున్నారని పేర్కొంటున్నారు. ఏ వస్తువు ఎంత పరిమాణంలో అందుబాటులో ఉందో స్పష్టత లేకపోవడం, క్రమపద్ధతిలో విక్రయాలు జరగకపోవడం ప్రచార కేంద్రాల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చే రామాలయంలో ప్రచార కేంద్రాల నిర్వహణపై దేవస్థానం అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ చెల్లింపులను అంగీకరించకపోవడానికి కారణాలేమిటి? సిబ్బంది భక్తులతో ఎలా వ్యవహరిస్తున్నారు? స్టాక్ నిర్వహణలో లోపాలున్నాయా? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. భక్తుల నుంచి వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డిజిటల్ చెల్లింపులు కల్పించాలి

ప్రచార కేంద్రాల్లో నగదు చెల్లింపులతోపాటు ఫోన్‌పే, గూగుల్‌పే తదితర యూపీఐ చెల్లింపులకు అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. సిబ్బందికి భక్తులతో మర్యాదగా వ్యవహరించేలా తగిన సూచనలు ఇవ్వడంతోపాటు, స్టాక్ నిర్వహణను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన అనుభూతి కల్పించాల్సిన దేవస్థానంలో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.



నాగార్జునసాగర్ లో లెవల్ కాలువలో ప్రమాదకర రసాయనాలు.. కలకలం!

పెద్దవూర నవంబర్ 1 (జనంసాక్షి)

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి సమీపంలో ఉన్న నాగార్జునసాగర్ లో లెవల్ కాలువలో గుర్తుతెలియని దుండగులు ప్రమాదకర రసాయనాలను పారబోయడం తీవ్ర కలకలం రేపింది. కాలువ నీటిలో రసాయనాలు కలవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రసాయనాలు పారబోసిన దుండగులను పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు తాగు, సాగునీటి ఆధారమైన కాలువను రసాయనాలతో కలుషితం చేసిన నిందితులను వెంటనే గుర్తించి, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

దీక్షా దివస్ కార్యక్రమంకు ఎంపికైన కోదాడ తేజ విద్యార్థిని



కోదాడ,(జనం సాక్షి):

సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా గుజరాత్ లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వద్ద ఉన్న ఎక్తానగర్ లో జాతీయ ఐక్యత దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎక్తానగర్ లో జరిగినఈ కార్యక్రమంకు దేశ వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన 1200 మందిని ఎంపిక చేయడం జరిగింది. ఇక్కడ పాల్గొనే అవకాశం తేజ విద్యాలయలో కోదాడ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నంద్యాల అనన్య కు దక్కింది. ఆమెతో పాటు సంరక్షకుడిగా నాన్న నంద్యాల జనార్దన్ రెడ్డి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రవాణా వసతి మరియుభోజన సౌకర్యాలు మొత్తం కేంద్ర ప్రభుత్వం చూసుకోవడం జరిగింది. ఎక్కడానికి స్టేడియంలో నరేంద్ర మోడి గారి ప్రసంగం వినడం, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ఎత్తైన విగ్రహం చూడడం జీవితకాల మధుర జ్ఞాపకం గా మిగిలిపోతుంది అని విద్యార్థిని నంద్యాల అనన్య తెలియజేసింది. ఇంటి గొప్ప అవకాశం మా పాఠశాలకు దక్కడం నిజంగా గర్వకారణమని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. నంద్యాల అనన్యను తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందించారు.

ఖమ్మం వరంగల్ నల్గొండ. పట్టభద్రులంతా

ఓటు నమోదు చేసుకోవాలి

ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్

మునుగోడు (నవంబర్ 1) జనంసాక్షి

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటర్ గా నమోదు చేసుకోవాలని ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ అధినేత భాస్కర్ పిలుపుమేరకు మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఖమ్మం,వరంగల్ ,నల్గొండ, ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీం సభ్యుడు రవితేజ మాట్లాడుతూ పట్టభద్రులు గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలని, ఈ ఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు లో క్యాంప్ నిర్వహించాము. టీం సభ్యులం అందరం అందుబాటులో ఉండి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతుంది. . ఈ కార్యక్రమాలు పాల్గొన్నవారు రాపోల్ నవీన్ కుమార్ . వరికుప్పల ముత్యాలు కృష్ణ , వీరస్వామి,మేడి అఖిల్ , స్వామి ఈ ఎల్ వి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కమిషన్ మారాలి ప్రజాస్వామ్య పరిరక్షణను కాపాడాలి

చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు



కనగల్లు, నవంబర్ 1 (జనం సాక్షి)

ఎస్ ఐ ఆర్ ప్రక్రియను తెచ్చి ఓటు చోరీ చేస్తున్న మతతత్వ శక్తుల కను సన్నలలో పనిచేస్తున్న ఎన్నికల కమిషన్ మారాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకుచలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో అధికార కాంగ్రెస్ పార్టీ మండల సర్పంచులు, నాయకులు ఆదివారం రామ్ లీలా మైదానానికి చేరుకొని కేంద్ర ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ జిల్లా సభ్యుడు కుసుకుంట్ల రాజారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, సర్పంచులు నర్సింగ్ మురళీధర్ గౌడ్, పోష మల్ల సురేష్ వంపు జానయ్య, మలికంటి రాజు, రావుల మల్లేష్, గోగు గోవర్ధన్ రెడ్డి, నామిరెడ్డి నరేందర్ రెడ్డి, బక్క రాజశేఖర్, కోరిమి శంకర్, చిరబోయిన యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ఎంతో ఆదరణ



సూర్యాపేట (జనంసాక్షి):

గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ఎనలేని ఆదరణ ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఈ ఎంపికలను కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు.ఎంపికైన క్రీడా కారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వికారాబాద్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు.విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని అన్నారు.క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు.రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా టీం కొరకు 25 మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపుకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహారావు, చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎస్ కె.ఇమామ్,రవీందర్ రెడ్డి, రమేష్ బాబు, ఇంద్రారెడ్డి, కోటి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది
- సూర్యాపేటలో జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్

షటిల్ క్రీడాకారుల కోసం ఉచిత గుండె వైద్య శిబిరం



సూర్యాపేట (జనంసాక్షి):

నిత్యం తమతో కలిసి షటిల్ ఆడుతూ సరదాగా గడిపిన తోటి క్రీడాకారుడు వెలుగు కరుణాకర్ ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందడం సహచర క్రీడాకారులను తీవ్ర విషాదానికి గురిచేసింది. కళ్లముందే తిరిగిన ఆత్మీయ క్రీడాకారుడు ఇక లేడనే వార్త అందరినీ కలచివేసింది.ఇలాంటి విషాదకర పరిస్థితి మరే క్రీడాకారుడి కుటుంబంలోనూ చోటుచేసుకోకూడదనే మానవీయ ఆలోచనతో గాయత్రి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ ముందడుగు వేశారు.తోటి క్రీడాకారుల ఆరోగ్యమే తన ఆరోగ్యంగా భావిస్తూ, షటిల్ ఆడే ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్వీ ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరానికి షటిల్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు.గుండె వైద్య నిపుణులు డాక్టర్ అలక ప్రేమ్ కుమార్ క్రీడాకారులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిపై తగిన సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ తోటి క్రీడాకారుడిని కోల్పోయిన బాధ నుంచి పుట్టిన ఈ ఆలోచన,మరెంతో మంది క్రీడాకారుల ప్రాణాలకు భరోసా కల్పించే మంచి ప్రయత్నంగా నిలిచిందన్నారు.క్రీడలతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, గుండె సంబంధిత పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదనే సందేశాన్ని ఈ శిబిరం అందించిందన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన ఆర్వీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ అలక ప్రేమ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.తోటి క్రీడాకారుడి జ్ఞాపకార్థం,ఇతరుల ప్రాణాల పట్ల బాధ్యతతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ను పలువురు అభినందించారు.ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

ఎల్లమ్మ అమ్మవారి దివ్యదర్శనం కై పోటెత్తిన భక్తులు

కనగల్లు, నవంబర్ 1 (జనం సాక్షి)

ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి దివ్య దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామునే అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి పట్టు వస్త్రాలు, నిమ్మకాయ దండలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో ఆలయ వద్దకు చేరుకొని పూజ లో పాల్గొన్నారు. వారికి అర్చకులు గోత్రనామార్చన కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి వడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయం సమీపంలో అమ్మవారి పుట్ట వద్ద ఉన్న వేప చెట్టుకు నవ దంపతులు కొబ్బరికాయ ముడుపు కట్టి సంతానం కలగాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంకట్ రెడ్డి, ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది , అర్చకులు పాల్గొన్నారు.



లింగగిరిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

○చదువులమ్మ ఒడిలో సేద తీరిన వైనం ○రెండు దశాబ్దాలు తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు
○57 మంది విద్యార్థుల్లో 30 మంది విద్యార్థులు 15 మంది విద్యార్థినులు హాజరు
○ఆత్మీయ కలయికలతో పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం
○పూర్వ విద్యార్థులే పాఠశాలకు నిజమైన ఆస్తి.. ○ పాఠశాలకు వాల్ క్లాక్ అందజేత



హుజూర్‌నగర్ రూరల్, నవంబర్ 1 (జనంసాక్షి):
మండల పరిధిలోగల లింగగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా, 20 ఏళ్ల తర్వాత ఒకే చోట చేరి కేరింతల నడుమ, ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. ఆదివారం లింగగిరితో పాటు పరిసర గ్రామాల, విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో పదవ తరగతి 2005 – 2006 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బీరెల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, విదేశాల్లో ఎంత ఎత్తుకు ఎదిగిన మళ్లీ ఆ పాఠశాలను చూడాలన్నా, తపనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం శుభ పరి ణామమని, పాఠశాలలో భోజనం ఏర్పాట్ల అనంతరం ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులను, ఘనంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జహూర్ ఆలం, మూర్తి, రాధా దుర్గా, రాఘవరెడ్డి, రేఖయ నాయక్, నరసింహారావు పూర్వ విద్యార్థులు మడూరి రామకృష్ణ , మడూరి గోపికృష్ణ , వడిగ నాగరాజు, జింకల నరసింహారావు, వీరస్వామి, వీరబాబు, లింగస్వామి, బాబా, షేరుద్దీన్, రవి, కళ్యాణి , నాగరాజు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వాడుకుందాం భావితరాలకు నీటిని అందిద్దాం

ముందస్తు జాగ్రత్తలతోనే నీటి ఎద్దడిని నివారించగలం

పున్న శైలజ, మున్సిపల్ చైర్ పర్సన్ దేవరకొండ



దేవరకొండ, నవంబర్ 01(జనం సాక్షి)
దేవరకొండ మున్సిపల్ పరిధిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా మున్సిపల్ చైర్ పర్సన్ వినియోగించాలని పున్న శైలజ పట్టణ ప్రజలకు సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని కోరారు. నీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ, ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావించాలని తెలిపారు.ఇళ్లలో కుళాయిలను అవసరం లేనప్పుడు తప్పనిసరిగా మూసివేయాలని, నీటి లీకేజీలను వెంటనే అరికట్టాలని, వాహనాల శుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత వంటి పనులకు సాధ్యమైనంత తక్కువ నీటిని వినియోగించా లని సూచించారు. తాగునీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీటి సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. నీటి సమస్య వచ్చిన తర్వాత ఇబ్బందులు పడటం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా ప్రతి కుటుంబం నీటి వినియోగంపై బాధ్యతగా వ్యవహరించాలని, పిల్లలకు సైతం నీటి పొదుపు ఆవశ్యకతను తెలియజేయాలని కోరారు.నేటి నీటి పొదుపే రేపటి నీటి భద్రతకు పునాది. ప్రజలందరూ సహకరించి నీటిని సంరక్షిస్తేనే భావితరాలకు నీటిని అందించగలమని మున్సిపల్ చైర్ పర్సన్ పేర్కొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఘనంగా లైఫ్ స్టార్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు..
చింతపల్లి, నవంబర్ 01(జనంసాక్షి)
చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వర నగర్‌లో నిర్వహించిన లైఫ్ స్టార్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.
వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, భవిష్యత్తులో ఆసుపత్రి మరింత అభివృద్ధి చెంది ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు పోలేపల్లి వినోద్, శ్రీనివాస్, ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు...



మహిళలు చట్టాలపై అవగాహనాతో ధైర్యంగా పోరాడాలి

- **అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు-పాలనలో దూసుకుపోతున్న దీర వనితలు**
- **మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి**
- **కే. అనిత సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవ అధికారి సంస్థ చైర్ పర్సన్**





దేవరకొండ నవంబర్ 01 (జనం సాక్షి)
బాలికలు,మహిళలు, ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో,పట్టుదలతో చదివితే భవిష్యత్తు బంగారు మయం అవుతుందని, భయం వీడితే విజయం సొంతం అవుతుందని సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవ అధికారి సంస్థ చైర్ పర్సన్ కి.అనిత సూచించారు.శనివారం రాత్రి దేవరకొండ పట్టణంలో ఈద్గా కమిటీ, మదర్స మిస్బ ఉల్ ఉలుమ్, జమియత్ ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ సీరతున్ నబీ జల్సా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలు, పోక్సో చట్టం ద్వారా బాలికలకు కల్పిస్తున్న రక్షణ వంటి అంశాలను వివరించారు.బాలికలు చదువుకుంటే సమాజం తొందరగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, తల్లిదండ్రులు ఆడ పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తే చాలు సమాజాన్ని గెలుస్తారని అవసరమైతే పదిమందికి ఉపాధి చూపిస్తారని అన్నారు. నేటి యుగంలో మహిళలు ఎలాంటి నిర్ణయమైనా స్వతంత్రంగా తీసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అక్షరాస్యత పెరిగిన రోజు నిజమైన అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం, నవంబర్ 1 (జనంసాక్షి)

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు దేశాన్ని అభివృద్ధి పరంగా తీవ్ర అధోగతి పాలు చేస్తున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విమర్శించారు. ఆదివారం ఖమ్మం మంచికంటి భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య, ప్రజా వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. అంతర్జాతీయంగా కార్పొరేట్ వ్యవస్థకు నాయకుడిగా ఉన్న ట్రంప్ అనుసరిస్తున్న విధానాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి, భారతదేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతోందని దుయ్యబట్టారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తూ, వారి ఏకఛత్రాధిపత్యాన్ని ప్రోత్సహిస్తూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాల నడ్డి విరిచే చర్యలను సమర్థిస్తోందన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై దౌర్జన్యంగా అణచివేతకు పాల్పడుతోందని, ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటగా ప్రశ్నించిందని గుర్తుచేశారు.

?ఓట్ల నమోదు ప్రక్రియ (సర్)ను దేశంలోని ఓటర్ల తొలగింపునకు కుట్రగా వాడారని, ఈ క్రమంలో దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లను, తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల వరకు ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సిపిఐ(ఎం) ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన, ఓటర్ల తొలగింపుపై మొదటగా సిపిఐ(ఎం) పార్టీయే అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలను సమాయత్తం చేసి, అఖిల పక్షాల ఆధ్వర్యంలో కేంద్రానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించిందని గుర్తుచేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలబడి ఆందోళనలు చేయడంలో పార్టీ సఫలీకృతమైందన్నారు. రాబోవు పట్టభద్రుల ఎన్నికల్లో మద్దతిస్తున్న అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉద్ఘాటించారు. త్వరలో నల్గొండలో జరగనున్న రైతు మహాసభలకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి, సభను ఘన విజయం చేయాలని పిలుపునిచ్చారు.

హత్యా రాజకీయాలపై రాజీలేని పోరాటం

సిపిఐ(ఎం) పార్టీ నాయకుడు సామినేని రామారావు దారుణ హత్యా ఉదంతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి అనుసరిస్తున్న హత్యా రాజకీయాలపై తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని పోతినేని సుదర్శన్ రావు స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, ఇటువంటి హత్యా రాజకీయాలను నిలదీస్తూ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

కరవు నివారణ చర్యలు చేపట్టాలి

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నీ నో పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయని పేర్కొన్నారు. కరువు మండలాల్లోని రైతాంగాన్ని. వ్యవసాయ కూలీలను, ప్రజలను అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల కి నష్టపరిహారం చెల్లించాలని. కరవు పేరుతో బియ్యం, నిత్యవసర వస్తువుల ధరలు తీవ్రంగా పెంచుతూ,బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని చెప్పారు. అధిక ధరల తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, ఈ కరువు పరిస్థితిలో ధరల నియంత్రణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు.అన్ని రకాల వస్తువుల ధరలు ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి 50 కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 15వ తేదీన నల్లగొండ పట్టణంలో జరుగుతున్న అఖిలభారత కిసాన్ మహాసభ ఆల్ ఇండియా మహాసభ సందర్భంగా లక్ష మందితో జరుగు బహిరంగ సభలో ఖమ్మం జిల్లా నుండి పదివేల మంది పాల్గొంటున్నారని చెప్పారు. రైతు సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సామినేని రామారావు హత్యపై సరైన దర్యాప్తు చేయకుండా, అసలైన దోషులను శిక్షించకుండా జిల్లా పోలీస్ కమిషనర్,కొంతమంది పోలీస్ యంత్రాంగం కట్టుకథ అల్లి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ హత్యను ఆర్థిక హత్యలుగా సృష్టిస్తున్నారని,ఇది పోలీస్ యంత్రాంగానికి సరైన పద్ధతి కాదన్నారు. ఇలా చేస్తే ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల రాజ్యాంగం పట్ల నమ్మకం కోల్పోతారని, రాష్ట్ర ముఖ్యమంత్రి వాగ్దానం చేసినట్టుగా సరైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సిట్ ను వెంటనే రంగంలోకి దింపి, హత్య పాల్పడిన అసలైన దోషులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ హత్య ప్లాన్ వెనుక కాంగ్రెస్ అది నాయకత్వం పక్కాగా ఉందని ఆరోపించారు. హత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలని, రామారావు భార్య పెట్టిన కేసు నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిని విచారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర పోలీస్ అధికారులను, రాష్ట్ర ముఖ్యమంత్రిని నున్నా నాగేశ్వరరావు కోరారు.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి. బుగ్గ వీటి సరళ బండి పద్మ. బండి రమేష్, వై విక్రం మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు. భూక్య వీరభద్రం బొంతు రాంబాబు, మడుపల్లి గోపాల్ రావు, మెరుగు సత్యనారాయణ,. సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా బాధ్యులు పిట్టల రవి, పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్రావు. ఎం సుబ్బారావు. చింతల చెరువు కోటేశ్వరరావు.. పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చర్ల నుంచి కూకట్‌పల్లి, గుంటూరుకు

బస్సులు నడపాలి

చర్ల, దుమ్ముగూడెం ప్రజల తరపున డిపో మేనేజర్‌కు వినతి

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)

చర్ల నుంచి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, గుంటూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పిలకా వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య కు వినతిపత్రం సమర్పించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి కూకట్‌పల్లికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రస్తుతం చర్ల నుంచి కూకట్‌పల్లికి ఐదు ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయని, వాటిలో అధిక చార్జీలు వసూలు చేస్తుండటంతో సామాన్య ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం చర్ల నుంచి కూకట్‌పల్లికి ఒక సూపర్ లగ్జరీ లేదా డీలక్స్ బస్సును రాకపోకల సర్వీసుగా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చర్ల నుంచి గుంటూరుకు కూడా ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రెండు మార్గాల్లో బస్సు సర్వీసులను మంజూరు చేయాలని డిపో మేనేజర్‌ను కోరారు. ఈ విషయంపై మరిన్ని వివరాలకు 8074880646 నంబరులో తనను సంప్రదించవచ్చని వెంకటరమణారెడ్డి తెలిపారు.

జనగణనలో బిసి కుల గణన చేయాలి

ఖమ్మం, నవంబర్ 1 జనంసాక్షి

.కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టే జనగణనలో బిసి కుల గణన తప్పకుండా చేపట్టాలని వక్తలు కోరారు.బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని మున్నూరుకాపు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు –అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ బిసి కులాలకు –సంబంధించిన జనాభా లెక్కలు లేకపోవడం వల్ల విద్య, వైద్య, ఉద్యోగ తదితర రంగాలలో రిజర్వేషన్లు కల్పించక ఆర్థికంగా, సామాజికంగా బిసి కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. 2027లో చేపట్టే జన గణనలో బిసి ఉపకులాలకు సంబంధించిన ప్రత్యేక కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి –పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, బిసి జేఏసి ఛైర్మన్ పాల్వంచ రామారావు, వివిధ సంఘాల నాయకులు పెళ్లూరి విజయ్కుమార్, పెరుగు వెంకటరమణ, సిహెచ్ రమేష్, తాటి నిర్మల, తమ్మిశెట్టి వెంకటరాజు, కత్తి నెహ్రూ గౌడ్, లిక్కి కృష్ణారావు, సుంకర శ్రీనివాస్, లింగబోయిన పుల్లారావు, రావుల హన్మంతరావు, గాదె లక్ష్మి నారాయణ, చేతుల నాగేశ్వరరావు, పగడాల అనంతరాములు, టి. పోతురాజు పాల్గొన్నారు.



మన్నెపల్లి వెంకటేశ్వరరావు మృతి తీరని లోటు

○ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర : టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం (జనంసాక్షి):

ట్రెజరీ శాఖలో సుమారు 36 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించి, సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందిన శ్రీ మన్నెపల్లి వెంకటేశ్వరరావు (కామ్రేడ్) గుండెపోటుతో అకాల మరణం చెందడం ఉద్యోగ వర్గాలకు తీరని లోటని టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈ జేఏసీ సెక్రెటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి ఏలూరి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్నెపల్లి వెంకటేశ్వరరావు ట్రెజరీ శాఖలో 36 ఏళ్ల పాటు అంకితభావం, నిబద్ధతతో పనిచేసి ఉద్యోగ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల చెల్లింపుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన పాటించేవారని గుర్తుచేశారు. సహచరులకు ఆప్తుడిగా, ఆపదలో అండగా నిలిచే స్నేహశీలిగా అందరి మన్ననలు పొందారన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, సకల జనుల సమ్మెలో, జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.



ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాసరావు, నాయకులు మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేంద్ర, తాళ్లూరు శ్రీకాంత్, పెద్దినేని రాధాకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ట్రెజరీ శాఖ నుంచి వి.సత్యనారాయణ, దుర్గాప్రసాద్, ఎన్.వి.కృష్ణారావు, ఎస్కే ఖాజామియా, విఠల్ రెడ్డి, ఎమ్.వెంకటేశ్వర్, ఉమామహేశ్వరరావు, బానోత్ దస్రు, ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రామ్మూర్తి, కృష్ణకుమారి, రాజా సాహెబ్, రవిచంద్ర, ప్రవీణ్, సౌజన్య, జ్యోతి తదితరులు నివాళులర్పించారు.

కాంగ్రెస్‌కు భారీ షాక్.. బీఆర్ఎస్‌లోకి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు!

❑ కరువు వస్తే చేతులెత్తేసిన చేతగాని సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతారు

❑ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలం

❑ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శలు



జనంసాక్షి,నవంబర్ 01(జనంసాక్షి) :

కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.పి.ఏపల్లి మండలం నక్కలపెంట తండాకు చెందిన ఉప సర్పంచ్,వార్డు సభ్యులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఆదివారం అంగడిపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో వారు గులాబీ కండువాలు కప్పుకున్నారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నిరాశే మిగిలింది

ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు,విద్యార్థులు,మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకుండా ప్రజలను భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. కరువు వస్తే చేతులెత్తేసిన చేతగాని ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతారని ఘాటుగా విమర్శించారు.

ఇది ప్రకృతి కరువు కాదు.. ప్రభుత్వ వైఫల్యం

కరువు నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి రైతులకు,ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ఆరు నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ కాలంలో కరువు నివారణకు తీసుకున్న చర్యలేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.గోదావరి,కృష్ణా నదుల్లో నీరు అందుబాటులో ఉన్న సమయంలో ఎందుకు వినియోగించుకోలేక పోయారని,ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వచ్చిన నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి తెలంగాణ ను కరువు బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం సహజమే అయినా,వాటిని ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించి ప్రజలకు అండగా నిలవడమే సమర్థవంతమైన పాలన అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రైతులకు భరోసా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు ప్రణాళికలతో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి రైతులకు సాగునీరు అందించారని రవీంద్ర కుమార్ గుర్తుచేశారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేశామని పేర్కొన్నారు.బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని, విద్యుత్ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరికలు వస్తున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త సమస్య అయితే,పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించా లని అన్నారు.తెలంగాణలో నీటి నిల్వలు తగ్గిపోవడానికి కారణాలేమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కరువు పేరుతో వ్యవసాయానికి నీరు అందించలేమని ముందుగానే చేతులెత్తేయడం పాలనా దక్షత కాదని, రైతులను సంక్షోభంలోకి నెట్టడమేనని విమర్శించారు.

కరువు నివారణకు కార్యాచరణ ప్రకటించాలి

రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి నిల్వలు,విద్యుత్ సరఫరా,ప్రత్యామ్నాయ పంటలు,పశు గ్రాసం,ఉపాధి హామీ పనులపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.బియ్యం ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగడం కాకుండా,ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దడంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

కరోనా సమయంలో వలస కూలీలను తెలంగాణ బిడ్డలు గా భావించి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుందని గుర్తు చేశారు.కేసీఆర్‌పై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో కనీసం కొంతైనా రైతులకు సాగునీరు,ప్రజలకు తాగునీరు అందించడంపై చూపించాలని సూచించారు. కరువు నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు అర్హత ఏమిటని ప్రశ్నించారు. నక్కలపెంట తండాకు చెందిన ఉప సర్పంచ్ అంగోతు మునియా,వార్డు సభ్యులు కేతావత్ హరియా,మేగావత్ కిషన్,కేతావత్ మంగ్తా, ముడావత్ బాలా,మేగావత్ హనుము బావాజీ,మేగావత్ కృష్ణ,కేతావత్ సంతోష్, జాతవత్ రాజా,జాతవత్ నాగేష్ , కేతావత్ కుమార్, ఆమ్‌గోతు రమేష్,ముడావత్ శ్రీనివాస్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి, సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రాయనబోయిన శ్రీను,ఆడెపు నగేష్,రమావత్ కిషన్, అర్వపల్లి నర్సింహ, తోటకూరి పరమేష్,బొడ్డుపల్లి మహేందర్, రమావత్ శ్రీను,రమావత్ దామోదర్, అనిల్,లోకేష్, మణిపాల్, శ్రీను, వెంకన్న, సురేందర్, సాయి,రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ ప్రవీణకు పరామర్శ

వైద్య ఖర్చులతో పాటు ఆర్థిక సహాయం అందించాలి..

మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసోన్..



అశ్వాపురం నవంబర్ 1 (జనంసాక్షి):

మిట్టగూడెం ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపో ఆర్టీసీ కండక్టర్ ప్రవీణకు మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసోన్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలువ శాంసన్ మాట్లాడుతూ.. ప్రవీణకు జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఆర్టీసీ ఉద్యోగినిపై జరిగిన దాడి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పూర్తిగా కోలుకుని తిరిగి విధుల్లో చేరే వరకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. అవసరమైన వైద్య ఖర్చులతో పాటు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేయడం హేయమైన చర్యని, ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీ ఉద్యోగులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప సిబ్బందిపై దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రవీణక పూర్తిగా కోలుకునే వరకు ఆమె కుటుంబానికి ఆర్టీసీ యాజమాన్యం అండగా ఉండాలని, తిరిగి విధుల్లో చేరిన అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే ప్రమోషన్‌తో పాటు అనుకూలమైన కార్యాలయ విధులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మాల మహానాడు తరపున ప్రవీణకు పూర్తి సానుభూతి, సంఘీభావం తెలియజేస్తున్నామని, ఆమెకు అన్ని విధాలా అండగా ఉంటామని కాలువ శాంసన్ తెలిపారు.

ఐఏఎస్ అధికారి నరహరిని కలిసిన ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్

గ్రామాల సమగ్ర అభివృద్ధిపై చర్చ



ఆత్మకూరు(ఎం) జనంసాక్షి (నవంబర్ 1)

ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ సీనియర్ ఐఏఎస్ అధికారి, పార్లమెంటరీ సెక్రటరీ పి. నరహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి, గ్రామపంచాయతీల బలోపేతం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు.

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధికి ఎలా కృషి చేయాలనే విషయాలపై నరహరి నుంచి విలువైన సూచనలు, సలహాలు తెలుసుకున్నట్లు మజ్జిగ నరేష్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అనుభవజ్ఞులైన అధికారుల మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



గరిడేపల్లిలో బట్టు గోరి దశదినకర్మ

నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి, నవంబర్ 1(జనం సాక్షి):-

మండల పరిధిలోని గరిడేపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బట్టు రాంజీ సతీమణి బట్టు గోరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం నిర్వహించిన ఆమె దశదినకర్మ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు,జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం తదితరులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా రాంజీని,ఆయన కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీవితంలో కష్టసుఖాలు పంచుకున్న భాగస్వామి అర్ధాంతరంగా దూరమవ్వడం విచారకరమని గ్రాంతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపూరి మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ ప్రసాద్, నాయకులు బానోత్ మాత్రు, లక్ష్మణ్,నాను, గోపి,వీరన్న,బట్టు రమేష్,బట్టు భాస్కర్,పెంట్య, రామ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు గాలికి.. ఢిల్లీలో నిరసనలా

కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఆగ్రహం.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఆత్మకూరు(ఎం) జనంసాక్షి (నవంబర్ 1)

స్థానిక సమస్యలను పట్టించుకోకుండా, ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ విమర్శించారు. మండలంలో బునాది గాని కాల్వ సమస్యతో పాటు ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. స్థానిక సమస్యలను పరిష్కరించకుండా ఓటు చోరీ అంశంపై నిరసనలకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాంబాబు, బూత్ అధ్యక్షుడు యాస వెంకట్‌రెడ్డి, నాయకులు యాస శ్రీనివాస్‌రెడ్డి, గద్దం స్వామి, యువమోర్చా మండల అధ్యక్షుడు భాషబోయిన లింగయ్య యాదవ్, నాతి సాయి శివ, పొన్నగాని సూర్య ప్రకాష్, బండారు సాయి తదితరులు పాల్గొన్నారు.



అడ్డగోలు దోపిడీకి తెరతీసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- గనులు, భూములు, ఇసుకను కొల్లగొడుతూ అరాచక పాలన
- ఫుడ్ పార్క్ వ్యవహారంలో భారీ కుంభకోణం.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ధ్వజం



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 01(జనంసాక్షి)
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం గనులు, భూములు, ఇసుకను అడ్డగోలుగా దోచుకుంటూ ప్రజా కంటక పాలన సాగిస్తోందని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు సహ ఇన్‌ఛార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టుల పేరుతో, 22ఏ భూముల పేరుతో రాష్ట్రాన్ని అక్షరాలా నాశనం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ వ్యవహారంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, బినామీల పేర్లతో అధికార పక్షం పెద్దలు భారీ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. కేవలం రూ. 22 కోట్ల టర్నోవర్ ఉన్న దీపక్ నెటిజెన్ అనే కంపెనీకి అవుట్ రైట్ సేల్ కింద ఏకంగా 72 ఎకరాల విలువైన భూమిని ఎకరానికి కేవలం రూ. 25 లక్షల చొప్పున కారు చౌకగా కట్టబెట్టడం దేశంలో ఎక్కడా జరగని వింత అని ఆయన విమర్శించారు. దీని వెనుక ఉన్న బినామీలు ఎవరో తక్షణమే బహిర్గతం చేయాలని, ఈ సమస్యను తాము ఎంతమాత్రం విడిచిపెట్ట బోమని స్పష్టం చేశారు. అలాగే సింగరేణి బొగ్గు గనుల్లో జరుగుతున్న బారీ అవినీతిపై తన వద్ద ఐదు గంటల పాటు మాట్లాడేంత పక్కా సమాచారం ఉందని, త్వరలోనే అన్ని బండారాలు బయటపెడతామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటే, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను గాలికొదిలేసి పంటలు వేయొద్దని ముఖ్యమంత్రి ఉచిత సలహాలు ఇవ్వడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లాకు ఏకంగా ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ రైతాంగాన్ని దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విధానాలు ఒకే నాణేనికి ఉన్న బొమ్మా, బొరుసు లాంటివని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. నేడు నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ వంటి పథకాలను అటకెక్కించిందని నిలదీశారు. కనీసం ఇందిరమ్మ ఇళ్లు కూడా అర్హులకు కాకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే కట్టబెట్టే దుస్థితికి దిగజారారని విమర్శించారు. దమ్ముంటే ఇప్పటివరకు ఎవరికి ఇళ్లు కేటాయించారో బహిరంగ పరచాలని ఆయన ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని, దేశ వ్యతిరేకులు, ఉగ్రవాదులతో కలిసి 'ఇండి కూటమి' పేరుతో దేశ విచ్ఛిన్నానికి కుట్రలు పన్నుతోందని సుధాకర్ రెడ్డి ఆరోపించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిద్రాహారాలు మాని రోజుకు 18 గంటల పాటు దేశాభివృద్ధి కోసం శ్రమిస్తుంటే, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి కాంగ్రెస్ నేతలు అసభ్యకరమైన పదజాలంతో ఆయనపై నిరాధార ఆరోపణలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు ఈ నకిలీ గాంధీలకు ఏమాత్రం అర్థం కావడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘాన్ని పొగిడే విపక్షాలు, ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలను తప్పుబట్టడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. అలాగే కమ్యూనిస్టులు కేరళలో కాంగ్రెస్ తో కొట్లాడుతూ, ఇక్కడ మాత్రం సిద్ధాంతాలను గాలికి వదిలేసి కమర్షియల్ పార్టీలుగా మారి పొత్తులు పెట్టుకోవడం శోచనీయమన్నారు.దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ దిగువ నుంచి పైకి తీసుకువచ్చారని, 140 కోట్ల మంది ప్రజలకు 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' నినాదంతో సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో నడుస్తున్న ఈ అవినీతి, అరాచక పాలనను అంతమొందించేందుకు యువత, నిరుద్యోగులు సన్నద్ధం అవుతున్నారని, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యవంతులైన విద్యావంతులంతా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామని, రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించి తీరుతారని ఆయన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ప్రబారి సన్నీ ఉదయ ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇవి రమేష్, రుద్ర ప్రదీప్, పాలేరు బిజెపి అభ్యర్థి నున్న రవికుమార్ ,జిల్లా ఉపాధ్యక్షులు వీరల్లి రాజేష్ ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య ,జిల్లా మోర్చా అధ్యక్షులు మంద సరస్వతి, రీగన్, ఐటి కన్వీనర్ బోయినపల్లి సురేష్ ,మీడియా కన్వీనర్ కృష్ణ, కుమిలి శ్రీనివాస్ రుద్ర గాని మాధవ్ శ్రీ లక్ష్మీ రెడ్డి ,గడిలనరేష్ ,వంశీ వెంకనారాయణ, మహేందర్ సింగ్ కోటి హనుమంతరావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

విద్యార్థినుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలి

బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు డిమాండ్



బోనకల్, నవంబర్ 1,(జనంసాక్షి):
బోనకల్ బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు ఆదివారం పరిశీలించారు.తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆదేశాల మేరకు, ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సూచనలతో, ఖమ్మం జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆర్ వి ఎస్ యాదవ్ ఆధ్వర్యంలో బోనకల్‌లోని బీసీ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు పరిశీలించారు.
హాస్టల్‌లో ఇటీవల భవనం స్లాబ్ పెచ్చులు ఊడి విద్యార్థినులపై పడటంతో కొంతమంది పిల్లలు గాయపడిన ఘటనపై నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్యార్థినులకు నాణ్యమైన బెడ్లు, దుప్పట్లు అందించాలి. దోమల నివారణకు దోమతెరలు ఏర్పాటు చేయాలి.హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి.విద్యార్థినులకు వేడి నీటి సౌకర్యం కల్పించాలి.హాస్టల్ భవనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, ప్రమాదకర పరిస్థితులను వెంటనే సరిచేయాలి.బోనకల్ హాస్టల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలి.విద్యార్థినుల భద్రతకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలి. విద్యార్థినుల ప్రాణాలు, భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆర్ వి ఎస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు , పిల్లలమర్రి వెంకట్, గంధసిరి వీరభద్రం గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లపు వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరపనేని అప్పారావు, బోనకల్ మండల నాయకులు తాళ్లూరి సురేష్, గంగుల నాగేశ్వరరావు, బెజవాడ నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

73 ఏళ్ల వయసులోనూ పతకాల వేట

- శంకరరావుకు ఘన సన్మానం

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)
అమెరికాలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి రెండు పతకాలు సాధించిన భద్రాచలానికి చెందిన విశ్రాంత ఎస్‌బీఐ అధికారి డి.వి. శంకరరావును భద్రాద్రి సాయం వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రినో నగరంలో నిర్వహించిన 2026 ఐపీఎఫ్ వరల్డ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో శంకరరావు క్లాసిక్ విభాగంలో కాంస్య, ఎక్విప్డ్ విభాగంలో రజత పతకాలు సాధించారు. 73 ఏళ్ల వయసులో బైపాస్ శస్త్రచికిత్సను సైతం అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం ఎంతో అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆయన సాధించిన విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి, దుర్గారావు, తుల సూర్యనారాయణ, తుమ్మ చంద్రశేఖరరావు, అనుమల్ల గంగాధరరావు, వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ సత్యనారాయణ, ప్రసాదు, ఆకుల సత్యనారాయణ, పసుపులేటి వెంకట్, కొర్లపాటి రాము, శ్రీనివాసాచారి, మల్లికార్జునరావు, జగ్గా పుల్లయ్య, కె. రామలింగేశ్వరరావు, బాలు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.





రామాలయానికి రూ.40 వేల విలువైన కార్పెట్ల వితరణ

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి హైదరాబాద్‌లోని వయాసిస్ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, హరిత దంపతులు రూ.40 వేల విలువైన రెండు కార్పెట్లను ఆదివారం వితరణగా అందజేశారు. తమ కుమారుడు విశృత్, కుమార్తె యషితతో కలిసి దేవస్థానం అధికారులకు వాటిని అందించారు. ఈ సేవా కార్యక్రమానికి సాయిబాబా ఆలయ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సమాజ సేవకుడు కడాలి నాగరాజు సహకరించారు. గతంలోనూ ఇదే సంస్థ రామాలయానికి కలర్ ప్రింటర్‌ను అందజేసింది. ఆలయ అవసరాలను గుర్తించి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదరరావు, ఏఈవో శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం నవంబర్ 01 (జనంసాక్షి)



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో శనివారం నిత్యకల్యాణ వేడుక భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రీరామ సేవా మండపంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి సింహాసనంపై ఆసీనులను చేసి కల్యాణ వేడుకను ప్రారంభించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం తదితర క్రతువులను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సమ సమాజ స్థాపనే అమరవీరులకు అర్పించే నివాళి

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 1(జనంసాక్షి)

నేటి పెట్టుబడిదారీ వ్యవస్థను కార్మిక వర్గం, రైతులు, అశేష ప్రజానీకం పోరాడి, కూలద్రోసి దోపిడీ లేని సమాన హక్కులు కలిగిన సమ సమాజాన్ని స్థాపించుకోవటమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సివైపుల్ల య పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం లో రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంతాప సభను నిర్వహించారు. ఈ సభకు ముందుఅమర వీరుల స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగరవేసి, పుష్పగుచ్ఛాలుంచి,ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా, సివైపుల్లయ్య హాజరై మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు వందేళ్ల ఉద్యమంలో దేశం కోసం, స్వాతంత్రం కోసం పేదల నుంచి విముక్తి కోసం, భూమి భుక్తి,విముక్తి కోసం ఎందరో పోరాడి అమరులైనారని, ప్రజల విముక్తే ప్రాణంగా భావించారని, ఎన్కౌంటర్లకు, హత్యలకు బలయ్యారని ఆయన అన్నారు. ఉరికొంభాన్ని ముద్దాడిన వారు ఉన్నారని స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో భగత్ సింగ్, అల్లూరి, తెలంగాణ సాయుధ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టు యోధులు, ప్రజలు, అనేక వీరోచిత పోరాటాలలో వేన వేల మంది ఎర్ర జెండాకు ఎరుపు లద్ది అమరుల య్యారని, వారికి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పించాలని ఆయన కోరారు. ఆ అమరుల సమ్మున్నత లక్ష్యం సోషలిస్టు సమాజమని, నూతన ప్రజాస్వామిక విప్లవమని, మనం వారిని నిత్యం గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. మరోవైపు పాలకవర్గాలన్నీ 80 ఏళ్లుగా పేదల పేరు చెప్పి, ధనికుల కు



కొమ్ము కాస్తున్నాయని, దేశ సంపదను, ప్రజావనరులను దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయని ఆయన విమర్శించారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మరింత విచ్చలవిడిగా దేశ మౌలిక వనరులన్నింటిని, ఆయిలు, ఖనిజాలు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఇస్రోను, ఎల్ఐసి, బ్యాంకులను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ ఇంటెన్సు రివిజన్ పేరుతో 13 కోట్ల 40 లక్షల మంది ఓట్లను అక్రమంగా తీసివేశారని, ప్రజాస్వామిక హక్కులు లేకుండా కుట్ర పన్నుతున్నారని, ప్రజాస్వామికంగా కాకుండా ఓటు చోరీ, నోట్ చోరీ,రిజల్ట్ చోరీ ద్వారా తమ పాసిస్టు రాజ్యాన్ని శాశ్వతం చేసుకోవాలని ప్రజాస్వామ్యక విలువలను ఆత్రవేయాలని పెద్ద పథకం అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో అమరవీరులు నడిచిన మార్గంలో కార్యకర్తలు నడవాలని, గోదావరి లోయ పోరులో అమరులైన బత్తుల వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, వెంకన్న, రామనర్సయ్య, నీలం రామ చంద్రయ్య, రాయల సుభాష్ చంద్రబోస్, డివీ కృష్ణ, దొరన్న,ధర్మన్న, బాటన్న,జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కుమార్ నారాయణ, జాసకిరామ్ రెడ్డి, కాచినపల్లి అమరవీరులు, ముస్మి అమరవీరులు, మాధవన్న,విక్రమ్, లింగన్న, ఎల్లన్న, పంచాది నిర్మల, సుశేన,చింతా లక్ష్మి, సీతక్క,రాయల చంద్రశేఖర్ లాంటి అమరవీరులు దోపిడీ లేని సమ సమాజం స్థాపన కోసం పోరాడారని వారి బాటలో మనమందరము పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ అండ్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి టి యు సి ఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి కే శ్రీనివాస్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ పార్టీ జిల్లా నాయకులు నామాల ఆజాద్, లెనిన్ బొల్లి కొమరయ్య ధరణి కృష్ణ చిలకల నరసింహారావు, రామనాథం, రమేష్, రవి, పి డి ఎస్ యు జిల్లా యాక్టింగ్ కార్యదర్శి రఘు, తోళ్ళ మురళి, వెంకటేష్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చ కార్యకర్తలకు దిశా నిర్దేశం

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 1 (జనంసాక్షి)

ఈరోజు ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి ఆదేశాల మేరకు, ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు హాజరై మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మహిళా మోర్చా బలోపేతం, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గం సమన్వయంతో పనిచేయాల్సిన విధానం, ప్రతి మండలంలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిని నియమించడంతో పాటు పూర్తిస్థాయి మండల కమిటీలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చించడం జరిగింది.ముఖ్యంగా రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని, అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఫారం-18 ద్వారా ఓటరు నమోదు చేయించే కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీకి సహకరించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా ఇన్‌చార్జి సునీత , రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు పమ్మి అనిత , జిల్లా మహిళా మోర్చా పదాధికారులు,, ప్రధాన కార్యదర్శులు మన్నెం నాగమణి, గడ్డం భవాని ఉపాధ్యక్షురాళ్లు, నీలిమ, పణి కుమారి, వసంత,కార్యదర్శులు,స్వర్ణ,, ఉమా,అధికార ప్రతినిధి, సీత, ఆఫీస్ సెక్రెటరీ మమత రెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ మానస,స్వచ్ఛ భారత్ కన్వీనర్,శాంతి,మండల అధ్యక్షురాళ్లు వాణి, లక్ష్మీ, కాత్యాయనీ కార్యవర్గ సభ్యురాలు సత్యవతి , తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యవర్గ సమావేశానికి హాజరై తమ విలువైన సూచనలు, సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా మహిళా మోర్చా తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ చేశారు.





ఖమ్మం చిన్నారి లీతికకు ఇండియన్ గ్లోరీ-2026 అవార్డు

సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఘన సన్మానం

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 1 (జనంసాక్షి)

జిమ్నాస్టిక్స్‌లో అసాధారణ ప్రతిభతో తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ఖమ్మం నగరానికి చెందిన శివ శృతి కుమార్తె చిన్నారి అనంతోజు లీతిక ప్రతిష్టాత్మక ఇండియన్ గ్లోరీ-2026 అవార్డును సొంతం చేసుకుంది.జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్ ఆడిటోరియంలో మేడిది వెంకటేశ్వర రావు, కళారత్నం మూవీస్ మరియు మేడిది సుబ్బయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్, మిమిక్రీ కళాకారులు, సినీ డైరెక్టర్ మల్లం రమేష్ చేతుల మీదుగా లీతికకు ఈ అవార్డును అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి మెమెంటోను బహుకరించారు.చిన్నతనంలోనే జిమ్నాస్టిక్స్‌లో అద్భుతమైన నైపుణ్యం కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించి స్పోర్ట్స్ స్కూల్‌లో ఉచిత సీటు పొందిన లీతిక ప్రతిభను సభలోని అతిథులు కొనియాడారు. లీతికను తీర్చిదిద్దడంలో నిరంతరం ప్రోత్సహిస్తున్న కోచ్ ఇందిర, విక్రమ్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావుల మార్గదర్శకత్వాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి అవార్డు సాధించి ఖమ్మం కీర్తిని పెంచిన లీతికకు ఆమె తాతయ్య, అమ్మమ్మ, కుటుంబ సభ్యులు, గురువులు, క్రీడాభిమానులు మరియు ఖమ్మం నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి - బీఆర్ఎస్ నేత భూక్యా అశోక్

ఖమ్మం, (జనంసాక్షి) :

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ పరిధిలో చేపట్టిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాలనీ రోడ్ నెం.7లోని బొడ్రాయి సమీపంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గోపాలపురం, బాలపేట, ఎల్వీ నగర్ ప్రాంతాలకు చెందిన పాత ఓటరు జాబితాలోని 432 మంది ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి నమోదు వివరాలు ఆరా తీశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి వివరాలను సరిచూడటంతో పాటు, ఇంకా దరఖాస్తు చేసుకోని వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఫోన్‌కు స్పందించని వారి చిరునామాలను సేకరించి, అందుబాటులో ఉన్న ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేని వారికి సాంకేతిక సహకారం అందిస్తూ, వాట్సాప్ ద్వారా పత్రాలు తెప్పించుకుని నమోదు పూర్తి చేసి రసీదులను అందజేశారు. నవంబర్ 6వ తేదీతో గడువు ముగియనున్నందున, అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని అశోక్ కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మన్నేపల్లి వెంకటేశ్వరరావుకు నామ, పువ్వాడ ఘన నివాళి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 1 (జనం సాక్షి)

ఖమ్మం వీడియోస్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి, కామ్రేడ్ మన్నేపల్లి వెంకటేశ్వరరావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లిన వారు ఆయన పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కామ్రేడ్ మన్నేపల్లి వెంకటేశ్వరరావు అజాతశత్రువని, అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కొనియాడారు. నామకు వెంకటేశ్వరరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు, కనకమేడల సత్యనారాయణ, యలమద్ది వెంకటేశ్వర్లు, రమేష్, మధుసూదన్, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, కృష్ణ ప్రసాద్ రేగళ్ల తదితరులు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం..

కరెంట్ ఆఫీస్ పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం



- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరవుతున్న కాలనీవాసులు, స్థానికులు
- కనిపించని పారిశుద్ధ్య నిర్వహణ.. పట్టించుకోని స్థానిక కార్పొరేటర్ తీరుపై తీవ్ర ఆగ్రహం
- "కార్పొరేటర్ ఉన్నాడా.. లేడా?" అంటూ మండిపడుతున్న ప్రజలు

కొత్తగూడెం క్రైమ్, నవంబర్01(జనం సాక్షి):
ప్రజల సమస్యలను పరిష్కరించి, డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన ప్రజాప్రతి నిధులు కొందరు క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరిస్తున్నారు. దీనికి నిదర్శనమే 39వ డివిజన్‌లో నెలకొన్న దయనీయ పరిస్థితి. డివిజన్ పరిధిలోని విద్యుత్ (కరెంట్) కార్యాలయం పక్కనే చెత్తా చెదారం భారీగా పేరుకుపోయి, దుర్వాసన వెద జల్లుతున్నా సంబంధిత అధికారులు గానీ, స్థానిక కార్పొరేటర్ గానీ కనీసం పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యాల బారిన పడుతున్న ప్రజలు
విద్యుత్ కార్యాలయం వంటి రద్దీ ప్రాంతం పక్కనే రోడ్డు పక్కన ఇలా చెత్త కుప్పలు పేరుకుపోవడం వల్ల ఆ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుప్పల నుండి వస్తున్న కుళ్ళిన వాసన, దోమల బెడద కారణంగా తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, దీనివల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్త వేయవద్దని బోర్డులు ఉన్నా, ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది.

కార్పొరేటర్ ఉన్నాడా.. లేడా?
ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించి గెలిచిన కార్పొరేటర్, గెలిచిన తర్వాత కనీసం డివిజన్ సమస్యలను గాలికొదిలేశారని ప్రజలు మండిపడుతున్నారు. డివిజన్‌లో ఇంత పెద్ద సమస్య కళ్లెదుటే కనిపిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవు తున్నాయి. "డివిజన్‌కు కార్పొరేటర్ ఉన్నాడా లేదా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ము న్సిపాలిటీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ స్పందించి.. వెంటనే స్పందించి చెత్తను తొలగించా లని, పారిశుద్ధ్య మెరుగుకు తక్షణ చర్యలు తీసు కోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



వైభవంగా శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ రాతి ద్వార ప్రతిష్ఠ

మాడుగులపల్లి, నవంబర్ 1 (జనంసాక్షి):
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ రాతి ద్వార ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది సంఘం అధ్యక్షుడు నక్కల మిన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పురోహితులు పెన్నా సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా రాతి ద్వారాన్ని ప్రతిష్ఠించారు ఈ సందర్భంగా విచ్చేసిన 800 మందికి పైగా భక్తులకు రజిత – లింగారెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులకు గౌడ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల వసతులు కల్పించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

లారీని ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడి దుర్మరణం

వలిగొండ, నవంబర్ 1 (జనంసాక్షి)



తొర్రూరు?వలిగొండ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన ధాపటి వీరస్వామి (36) హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకులో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 31న రాత్రి తన స్వగ్రామం నుంచి హోండా యూనికార్న్ బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 10:30 గంటల సమయంలో తొర్రూరు?వలిగొండ రహదారిపై అంబోజు సత్యరాములు వ్యవసాయ పొలం సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై వీరస్వామి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతుడి సోదరుడు ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రామానుజన్ గణిత ఒలంపియాడ్‌లో జయ విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట (జనంసాక్షి):
రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం వారు నిర్వహించిన గణిత ఒలంపియాడ్ లో తమ పాఠశాలకు చెందిన 94 మంది విద్యార్థులు రెండవ లెవెల్ కు అర్హత సాధించినట్లు జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుండి 13 మంది విద్యార్థులు, 6వ తరగతి నుండి 11 మంది విద్యార్థులు, 7వ తరగతి నుండి 17 మంది విద్యార్థులు, 8వ తరగతి నుండి 19 మంది విద్యార్థులు, 9వ తరగతి నుండి 19 మంది విద్యార్థులు, 10వ తరగతి నుండి 15 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు.తమ పాఠశాలలో గణితంపై నిర్వహించే వివిధ కార్యక్రమాలు, అత్యుత్తమ ప్రోగ్రామ్ ద్వారా తమ విద్యార్థులు



టాలెంట్ టెస్టులలో విజయం సాధిస్తున్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థు లను, ఈ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యా యులను అభినందించారు. తమకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి వారి మాస కళ్యాణం

సూర్యాపేట(జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలో సీతారామచంద్రస్వామి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కళ్యాణంను దేవాలయ అర్చకులు ధరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు.పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు.శాస్త్రోక్తంగా మాంగల్యధారణతో కళ్యాణ తంతు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవేదాంత భజన మందిరం కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమా అశోక్, సోమ సుమన్, ఓరుగంటి చంద్రశేఖర్,అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, భక్తులు,మందిరం మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరుకున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర

- బీసీల రాజ్యాధికారం కోసం ప్రతీ ఒక్కరూ ఐక్యం కావాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న పిలుపు

మాడ్గులపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి):
బీసీల రాజ్యాధికారం సాధించడమే ప్రధాన ధ్యేయంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించి పాదయాత్ర చేపట్టినట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం రోజున మాడ్గులపల్లి మండల కేంద్రానికి చేరుకుంది.ఈ సందర్భంగా మండలంలోని కుక్కడం, మాడ్గులపల్లి, కొత్తగూడెం గ్రామాల మీదుగా పాదయాత్ర ఉత్సాహభరిత వాతావరణంలో ముందుకు సాగింది దారిపొడవునా ప్రజలను, స్థానికులను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన



సమావేశంలో తీన్మార్ మల్లన్న మాట్లాడారు.బీసీల రాజ్యాధికారం కోసం బీసీ కులాలు, బహుజనులందరూ ఒకే వేదికపైకి వచ్చి ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు హక్కుల సాధన కోసం, భవిష్యత్ తరాల బాగు కోసం తాను నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు నియోజకవర్గ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని కోరారు ప్రజా సమస్యల పరిష్కారానికి, బహుజన హక్కుల సాధనకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు పాదయాత్ర అనంతరం తీన్మార్ మల్లన్న మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఉన్న వి.ఎస్. గార్డెన్ లో బస చేశారు.



జనంసాక్షి

అమరుల వీరుల ఆశయాల సాధన కోసం

సమర శీల పోరాటాలు నిర్వహించుదాము

సి పి ఐ యం ఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య , శివలింగం



తిరుమలాయపాలెం నవంబర్ 1 (జనంసాక్షి) :
తిరుమలాయపాలెం మండలం లోని తిమ్మక్కపేట గ్రామంలో అమరవీరుల వర్ధంతి సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య మాట్లాడుతూ ఈ దేశంలో మనిషిని మరొక మనిషి దోపిడీ చేసే విధానం రద్దు కావాలని మనిషి బ్రతకటానికి ఇల్లు. తినడానికి తిండి (. ఆహారం) వైద్య. విద్య. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో లక్షలాది ఎకరాల పోడు భూములను కొట్టించి పేదలకు పంచి రాజ్యం చేత అమరులైన అమరవీరుల స్మరించుకుంటూ ఈరోజు సి పి ఐ యం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు తిరుమలాయపాలెం మండలం తిమ్మక్కపేట గ్రామం లోఅమర వీరుల వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. అఖిలభారత ప్రగశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) మండల నాయకుడు సుంచు బిక్షం అధ్యక్షతన తిమ్మక్కపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు రేపాకుల శివలింగం మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం వందేళ్ల జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేసిన అమరులకు పొట్ల రామ నరసయ్య. గడ్డం వెంకట్రామయ్య. రాయల సుభాష్ చంద్రబోస్. చంద్రశేఖర్. బట్టు అంజయ్య (సురేష్ అన్న) కందాల నరసింహారెడ్డి, శ్రీపాద శ్రీహరి, జానకి రామ్ రెడ్డి, కుమార్ నారాయణ, బాటన, కోటన్న, చింతా లక్ష్మి, నోముల పరుశురాములు, సుసేన, నంబూరి సీతారామరాజు, రాయల వెంకట్ నారాయణ, రాంబాయమ్మ, పుసులూరి బుచ్చయ్య. సత్యం. వంగూరు వెంకయ్య. చినమల్సూర్, పెదమల్సూర్, సిరా చంద్రయ్య, మందుల భద్రయ్య . తదితర అమరవీరుల కు జోహార్లు తెలియజేశారు. నేడు దేశంలో మతోన్మాద బీజేపీ దేశ ప్రజలపై పెను దాడి చేస్తుందని అన్నారు. రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని అన్నారు . అమరులు ఆశించిన నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించడమే అమరులకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు (ఎస్ వి), సుంచు వెంకన్న, తిమ్మక్కపేట సర్పంచి రేపాకుల సుభద్ర, గండికోట వెంకన్న. భాష్పంగు రాములు, వీరమల్లు, బాబు, గోపయ్య, వెంకయ్య, నవిల మరియమ్మ, కనకమ్మ, మహేష్, కూచిపూడి ఎంకమ్మ, పత్తి సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు



చౌటుప్పల్ 100 పడకల హాస్పిటల్ ను
వెంటనే పూర్తి చేయాలి

నేడు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన డా.ఇ ఎల్ వి భాస్కర్

చౌటుప్పల్ నవంబర్ 1(జనంసాక్షి)
మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్ ను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ కార్యక్రమానికి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డా. ఇ.ఎల్.వి.భాస్కర్ పిలుపునిచ్చారు.నేడు సోమవారం ఉదయం 9గంటలకు చౌటుప్పల్ లోని ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ ఆఫీస్ నుంచి యాత్ర ప్రారంభమై యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా డా.ఇ ఎల్ వి భాస్కర్ మాట్లాడుతూ,చౌటుప్పల్ ఇప్పుడు సాధారణ పట్టణం కాదు, విజయవాడ హైవే పై వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీ. రోజూ వేలాది మంది ప్రజలు, వాహనాలు తిరుగుతున్నాయి. కానీ ఇక్కడ అత్యవసర వైద్యం అందే పరిస్థితి లేదు. చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా, గుండెపోటు వచ్చినా, గర్భిణీ స్త్రీలకు అత్యవసర సమయంలో హైదరాబాద్ కు 50 కిలోమీటర్లు పరుగెత్తాల్సిన దుస్థితి ఉంది. దారిలోనే చాలా మంది ప్రాణాలు పోతున్నాయి.100 పడకల హాస్పిటల్ కు శంకుస్థాపన జరిగి, నిర్మాణం పూర్తి కాకపోవడం,ఆగిపోవడం బాధాకరం. గత ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ హాస్పిటల్ ను ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ కు బిల్లులు ఇవ్వకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని తెలుస్తోంది.100 పడకల హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి, డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి.అత్యవసర విభాగం (ఎమర్జెన్సీ,ట్రామా కేర్), ఐసీయూ సౌకర్యం వెంటనే అందుబాటులోకి తేవాలి.మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించాలి.ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన పోరాటం కాదు.నియోజకవర్గం లో ఉన్న ప్రజలందరి ప్రాణాలకు సంబంధించిన పోరాటం. అందుకే అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరుతున్నాను అని డా. భాస్కర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

ఢిల్లీ వేదికగాజరిగిన ఓటు చోరికి వ్యతిరేకర్యాలీ లొ
సత్తుపల్లి ఎంఎల్ఏ రాగమయి నిరసనగళం

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎంఎల్ఏ రాగమయి నిరసన గళం..
రాహుల్ గాంధీ నాయకత్వంలో జరిగిన భారీ ర్యాలీకి మద్దతుగా పాల్గొన్న ఎం ఎల్ ఏ రాగమయి



పెనుబల్లి, నవంబర్ 1 (జనం సాక్షి)
ఓటు చోరీకి వ్యతిరేకంగా ఆదివారంఢిల్లీ వేదికగా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీకి మద్దతుగా సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.డప్పు వాయిస్తూ ఓటు చోరీకి వ్యతిరేకంగా పాట పాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి తన గళాన్ని వినిపించారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి ఢిల్లీ వేదికగా ఎం ఎల్ ఏ రాగమయి, సహచర ఎం ఎల్ ఏ యశస్విని రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సందీప్ గౌడ్, సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్ ల తో కలిసి తన నిరసన గళాన్ని వినిపించి మరోసారి ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ రాగమయి నేషనల్ మీడియాతొ ఓటు చోరీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రజలలో విశ్వాసం నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఎల్లంకి యాదగిరి

మునుగోడు జనం సాక్షి (నవంబర్ 01)
మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ ఎల్లంకి యాదగిరి గ్రామ గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ. గౌడ కులస్తులందరికీ అండగా ఉంటానని అన్నారు,నన్ను అధ్యక్షులుగా ఎంపిక చేసిన గౌడ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా అయితగొని సైదులు, నకరికంటి యాదగిరి కోశాధికారి, అయితగోని మల్లేష్, ఎల్లంకి యాదయ్య, అయితగొని యాదయ్య, వెంకన్న,నరసింహ, చంద్రయ్య, స్వామి,పల్లె లింగస్వామి,చేనగోని శ్రీను, తదితరులు,పాల్గొన్నారు.





5వ వార్డులో అభివృద్ధి
పనులకు శంకుస్థాపన

రూ.1.50 కోట్లతో మౌలిక వసతుల కల్పన..

ఖమ్మం రూరల్, నవంబర్ 1 (జనంసాక్షి):
ఏళ్ల తరబడి రోడ్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎదులాపురం మున్సిపాలిటీ 5వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టనున్న మౌలిక వసతుల పనుల్లో భాగంగా ఆదివారం గ్రీన్ కాకతీయ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని 5వ వార్డులోని గ్రీన్ కాకతీయ నగర్, జలగం నగర్, ఆర్టీసీ కాలనీ, పెద్దతండా కాలనీ, కేబీఆర్ నగర్ ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మొత్తం నిధుల్లో సుమారు 70 శాతం గ్రీన్ కాకతీయ నగర్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం కోసం స్థానికులు ఏళ్ల తరబడి చేస్తున్న విజ్ఞప్తులకు స్పందించి పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

మంత్రి పొంగులేటికి ప్రత్యేక కృతజ్ఞతలు
5వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డికి వార్డు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని నవీన్, ఎదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోతు కిషోర్, వార్డు కౌన్సిలర్లు బానోతు నాగేంద్ర ప్రసాద్, బానోత్ దివ్య, బానోతు పుల్చంద్, బుర్ర మహేష్, మున్సిపల్ ఏఈ అప్పారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కిషన్, 26వ వార్డు అధ్యక్షుడు సునీల్, 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకన్న, టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ డైరెక్టర్ రంజిత్ నాయక్, స్థానిక కాలనీ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాలెంల గ్రామవాసికి డాక్టరేట్ ప్రధానం

సూర్యాపేట (జనంసాక్షి):

జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్మెంట్ అండ్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న సూర్యాపేట మండలం బాలెంల గ్రామ వాసి గంట కృష్ణమ నాయుడు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో బ్రాండ్ ఇమేజ్ వినియోగదారుల కొనుగోలు ప్రవర్తన దాని ప్రభావం ఎంపిక చేసిన గృహ ఉపకరణాల ప్రత్యేక సందర్భంలో ఒక అధ్యాయం అనే అంశంపై డాక్టర్ సబీనా ఆర్ హెరాల్డ్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ ఎంవి రమణారెడ్డి చేతుల మీదుగా ఆయన గౌరవ డాక్టరేట్ పొందారు.మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో విద్యనభ్యసించి డాక్టరేట్ పొందిన గంట కృష్ణమనాయుడును యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ ఆలువాల రవి అభినందించారు.తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమ నాయుడు డాక్టరేట్ సాధించడం పట్ల ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాజు, మేనేజ్మెంట్ అభినందించారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.